
# సత్యవాక్కు

# the word of truth



ైస్తవ మాసపత్రిక

JANUARY 1997

## సంక్షిప్త వార్తలు

సోదరులు జాషువా గూటం గారు, వారి సతీమణి కవిత గారు డిశంబరు 1నుండి 4 వరకు థాయ్‌లాండ్‌లో చింగ్మాయ్ సిటీలో జరిగిన ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో పాల్గొనిరి. అందు సోదరులు జాషువా గారు రెండుమార్లు ఉపన్యాసము చేసిరి. అటు తరువాత రెండురోజులు బ్యాంకాక్‌లో యుండి డిశంబరు 8వ తేదీనాటికి కాకినాడ క్షేమముగా చేరుకొనిరి.

డిశంబరు 20వ తేదీ సాయంత్రము అమెరికానుండి వచ్చిన ఐరా. వై. రైస్ గారు దామునాపల్లిలో నిర్మించబడిన ఆలయమును రిబ్బను కత్తిరించి తెరచిరి. ఆ దినమందు జరిగిన సభలో నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరులు రైస్ గారితో సోదరులు బాబ్ బెరార్డ్ గారు కూడ ఆరోజు వాక్యపరిచర్య చేసిరి. చోడవరం, దామునాపల్లిలో సోదరులు M. ప్రసంగి గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

డిశంబరు 21నాడు దొడ్డిగుంటలోను, చినదొడ్డిగుంటలోను జరిగిన సువార్త కూటములలో పై ఇద్దరు సోదరులు వాక్యపరిచర్యచేయగా, చినదొడ్డిగుంటలో ఆరుగురు క్రీసులోనికి బాప్తిస్మము పొందిరి.

డిశంబరు 22న కొత్తపేటలో నిర్మించబడిన ఆలయమును ఐరా . వై . రైస్‌గారు రిబ్బను కత్తిరించి తెరచిరి. క్రొత్తపేటలో N. J. మోహన్‌రావ్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

సోదరులు రైస్‌గారు, బెరార్డ్ గారు గోదావరి డెల్టాలో తుఫాను బాధిత సంఘములను దర్శించి ఒక్కో స్త్రీకి ఒక చీర, ఒక్కో పురుషునికి ఒక దుప్పటి పంచి సంఘములను ఆదరించిరి.

డిశంబరు నెల సువార్తికుల సదస్సు 24వ తేదీన కాకినాడ సత్యవాణి బిల్డింగ్ నందు క్షేమాభివృద్ధి కరముగ జరిగెను. వివిధ జిల్లాలనుండి 400 మంది సువార్తికులు సకాలంలో తరలిరాగా ఐరా. వై. రైస్ (అమెరికా), బాబ్ బెరార్డ్ (అమెరికా) గార్లు మంచి సందేశములను అందించి సహోదరుల హృదయాలకు ఆదరణ కలిగించిరి.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

Phone : 0884-63722

**Editor :** **J.C.CHOATE** **Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 17 జనవరి 1997 సంచిక 6


## సంపాద కీయం

### క్రీస్తు సంఘము సాటిలేనిది

**(The Church of Christ is Distinctive)**

ఇండియాలోగాని అమెరికాలోగాని లేక ప్రపంచమందలి పెద్ద రహదార్లపై ప్రయాణించినప్పుడు మత సంబంధమైన విభజనలు స్పష్టంగా కనబడును. వివిధములైన పేర్లు వ్రాయబడిన ప్రార్ధనా మందిరములు విభజనలను తెలియజేయుచు కనబడును. కొన్ని సంవత్సరాల క్రితము ఒక అంతర్జాతీయ సువార్తికుడు నేడు భూమి మీద 800 వేర్వేరు సంఘాలున్నట్లు చెప్పిన సంగతి నేను విన్నాను! క్రీస్తు మరణించినది ఇందుకొరకా ? కాదు. క్రైస్తవులంతా ఏకమైయుండాలని ఆయన చేసిన ప్రార్ధనను ఈ విషయాలు తిరస్కరించుచున్నాయి (యోహా 17:20-21). ఈ రకమైన విభజన ఆత్మసంబంధమైనది కాదని పౌలు ఖండించెను (1కొరింథీ 1:10). ఎఫెసీ 4:1-6లో చెప్పబడినట్లు పరిశుద్ధాత్మ కోరిన దైవికమైన ఐక్యత యొక్క క్రమమును కలిగియుండాలి. ప్రభువు ఒకే- ఆత్మీయ శరీరమును కట్టుటకు వాగ్దానము చేసెను (మత్తయి 16:18). ఆదిమ శతాబ్దంలో పౌలు, పేతురు, యాకోబు,

యోహాను, ఫిలిప్పు మరియు స్తెఫను ఈ సంఘసభ్యులై యున్నారు. అది క్రీస్తు యొక్క విలువైన రక్తముతో కట్టబడినట్టిది. అది ప్రత్యేకమైనది. ఏకత్వముకలది. అదే ప్రభువు సంఘము ఇప్పుడు కూడా ఉన్నది.

విభజింపబడి, అసామాన్యమైన స్థితిలో మండుటయందు ప్రత్యేకత ఏమియు లేదు. క్రీస్తుసంఘము సాటిలేనిది ఎందుకనగా అది బైబిలుపై ఆధారపడి నడచునట్టిది. అందువలన దాని నిర్వహణ బోధ, ఆరాధన, సంఘ జీవితము కలవర పరచేవిగా లేవు.

క్రొత్త నిబంధనలో సంఘమును గూర్చి 150 కంటె ఎక్కువ సార్లు ప్రకటించ బడింది. పరలోక రాజ్యమని కూడా అది వర్ణించబడినది. ఎఫెస్సీ 5వ అధ్యాయములో క్రీస్తుకు సంఘము లోబడి యుండాలని చెప్పబడింది. ఒక పోప్‌కు గాని మానవ సమావేశాలకు గాని విశ్వాస ప్రమాణ పుస్తకాలకు గాని లోబడక దేవునికే లోబడి యుండాలి. ఈ సత్యము క్రీస్తు సంఘముయొక్క ప్రత్యేకతను గొప్పగా వివరించు చున్నది. ఎఫెస్సీ 3:21 నందు "సంఘములో" ఇప్పుడు తరతరములకు దేవుడు మహిమ పర్చబడాలని వ్రాయబడినట్లు మనము నేర్చుకొనుచున్నాము. మనము చదువుచున్న పాఠ్యాంశము యొక్క విలువ దేనితోను పోల్చలేనట్టిది.

ప్రభువు సంఘము నేడున్నదా? బైబిలులో వ్రాయబడిన సంఘమును పోలిన సంఘము ఈ 20వ శతాబ్దములో ఉండుట అసాధ్యమని కొందరి అభిప్రాయము. లూకా 8:11 చదువుదాం.

## విత్తనము దేవుని వాక్యము

ఎక్కడ మానవులు దేవుని వాక్యమునకు ఖచ్చితముగా విధేయత చూపుదురో అక్కడ ప్రభువు సంఘముండును. మొదటి శతాబ్దంలో వారేమి చేసిరో మనమును వాక్యానుసారముగా అది జరిగించిన యెడల వారేమై యున్నారో మనమును అట్టి వారమై యుందుము. వారు క్రైస్తవులై యుండిరి (1పేతు 4:16) వారు క్రీస్తు సంఘసభ్యులు (రోమా 16:16).

మరొకవాదన ఉన్నది: "స్వచ్ఛమైన క్రైస్తవ్యము స్థాపింపబడి చాలా సంవత్సరములు

గతించిపోయినవి. చీకటియుగమందు దైవికమైన సత్యము అంతటితో పోయినది. మనము క్రైస్తవులుగా ఉండలేము. మనము ఏదోఒక మతశాఖలో సభ్యులమై యుండగలము". వేలాది మంది ఈ విధమైన నిర్ణయానికే వచ్చుచున్నారు. కాని ఇది నిజమా? యెహోవా నోటినుండి వచ్చు వచనము నిష్ఫలముగా మరలదని చెప్పబడెను (యెష 55:11). దైవా వేశమువలన కలిగిన లేఖనములు దైవజనుని సంపూర్ణునిగా చేయునని 2తిమోతి 3:16-17 చెప్పుచున్నది. దైవసత్యముపై అపవాదికి జయము కలుగునట్లు మానవుని విమోచనా సంకల్పమును మార్చ గలుగుటకు దేవుడే అధికారమిచ్చెననే తలంపు చాలా వింతగానున్నది. 1900 సంవత్సరాల క్రైతము వారెట్లు క్రీస్తు దాసులై యుండిరో మనము కూడా అట్లే ఆయనకు నేడు దాసులమై యుండగలము. సువార్తశక్తిని ఈ మధ్య జరిగిపోయిన సంవత్సరాలు మరుగుచేయలేవు . రక్షణకొరకు అదే బోధ ఇప్పుడున్నది (రోమా 1:16, 2థెస్స 2:14).

## లేఖనములకు ప్రాముఖ్యత

మొదటిగా క్రీస్తు సంఘము లేఖనముల యెడల దాని ఉద్దేశ్యమును బట్టి సాటిలేనిది. కేథలిక్ అధికారమునకు మానవ సంకల్పిత సిద్ధాంతాలకు ఇచ్చుట ఏ ప్రాముఖ్యములేదు. గ్రంధములకు గ్రంధమైన బైబిలు అట్టివారికి లోబడుట బుద్ధిహీనతయని జ్ఞాపకము చేయుచున్నది. మూడువచనాలను పరిశీలించుదాం:

కొలస్స 2:8: "ఆయనను అనుసరింపక మనుష్యుల పారం పర్యాచారమును, అనగా ఈ లోక సంబంధమైన మూల పాఠములను అనుసరించి మోసకరమైన నిరర్ధక తత్వజ్ఞానము చేత మిమ్మును చెరపట్టుకొని పోవువాడెవడైనా ఉండునేమో అని జాగ్రత్తగా ఉండుడి"

మార్కు 7:9: "మరియు ఆయన-మీరు మీ పారంపర్యాచారమును గైకొనుటకు దేవుని ఆజ్ఞను బొత్తిగా నిరాకరించుదురు"

మత్తయి 28:18: "యేసు వారియొద్దకు వచ్చి-పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది".

అవును క్రీస్తుకు పరలోకమందును, భూమిమీదను అధికారము కలదు. ఆయన శక్తిగల వాక్యముద్వారా మనలను నడిపించుచున్నాడు. రోమాలోనున్న పోపుఅధికారము వలన మనము నడిపించబడుట లేదు. "స్వాతంత్ర్యమునిచ్చు సంపూర్ణమయిన నియమము" (యాకో 1:25) నకు మనము విధేయత చూపిన యెడల మానవ పారంపర్యాచారములను పారద్రోలగలము.

బైబిలు యెడల క్రీస్తు సంఘము యొక్క గురియేదో అందరికీ తెలిసిన ఈ మాటద్వారా విశదమగుచున్నది.

"మేము బైబిలు మాట్లాడుచోట మాట్లాడుదుము. బైబిలు మౌనంగా నున్నచోట మౌనముగా నుందుము. "టైమ్" పత్రిక మతము అనే శీర్షికలో క్రీస్తు సంఘ సభ్యులు మిగిలిన వారికంటే బైబిలును పాటించువారిని వ్రాసింది. నిజముగా, ఆయన జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నాడనే (2పేతు 1:3) లేఖనాలు చెప్పే విషయాన్ని మేము నమ్ముచున్నాము. దేవుని దృష్టిలో పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు లేఖనములు మాత్రమే ప్రయోజనకరమైనవి (2తిమో 3:16-17). అందువలన మనకు విశ్వాస ప్రమాణ పుస్తకాలుగాని ఈ మధ్యకాలములో బయలు పరచబడినవని చెప్పే విషయాలుగాని పోపు యొక్క సార్వత్రిక అధికారముగాని అవసరములేదు. ఓటు వేసేపరిస్థితి క్రైస్తవులలో లేనేలేదు. 1900 సంవత్సరాల కంటె ముందు పరలోకంనుండి లేఖనాలు బయలు పరచబడినవి. దేవుని వాక్యానికి లోబడి యుండాలనేదే మాగురి! బైబిలు యెడల మేము కలిగియున్న ఈ గురి క్రీస్తు సంఘము సాటిలేని దనుటకు తార్కాణముగా నున్నది. ఏదైన ఒక క్రొత్తబోధ క్రైస్తవ్యములో కనబడినప్పుడు మనం ఒక నిర్ణయానికి రావలసియున్నది. అదేమనగా "అది సత్యమైతే క్రొత్తదికాదు, అది క్రొత్తదైతే సత్యముకాదు". ఒకానొక దినాన లేఖనముల ద్వారా మనకు తీర్పు తీర్చబడును (యోహా 12:48). మనము వాటిద్వారా నడిపింప బడవలసిన వారమై యున్నాము. "ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించినట్టు బోదించ వలెను" (1పేతు 4:11). యిట్టి ఉద్దేశ్యము మనం కలిగియుంటేఆరాధనలో గాత్ర సంగీతమును మాత్రమే ఉపయోగించగలము. క్రీస్తు క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు (హెబ్రీ 9:15). మీ హృదయములో

ప్రభువుని గూర్చి పాడుచు కీర్తించుడి అని వ్రాయబడియున్నది (కొలస్స 3:16, ఎఫెస్సీ 5:19). యిదే మనము చేయవలసియున్నది. 7వ శతాబ్దంలో పోప్ వైటాలియన్ అనునతడు మొట్టమొదట యాంత్రిక సంగీతమును ఆరాధనా సమావేశాలలో ప్రవేశపెట్టెనని చరిత్ర చెప్పుచున్నది. 11వ శతాబ్దము వచ్చేటప్పటికి యాంత్రిక సంగీతము సామాన్యముగా ఆచరణలోనికి వచ్చినది. గొప్ప మతనాయకులైన జాన్ కేల్విన్, జాన్‌వెస్లీ, ఏడమ్ క్లార్క్ మరియు చార్లెస్ స్పర్జన్ అనువారు యాంత్రిక సంగీతమును ఆరాధనలో ఉపయోగించుట వ్యతిరేకించిన సందర్భాలను మేము గుర్తు చేయగలము. కాని మేము మా ప్రభువుయొక్క అభిప్రాయమునకే ప్రాముఖ్యతనిచ్చు చున్నాము. బైబిలు యొక్క సర్వసంపూర్ణత ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనము జరిగించునట్లు మమ్ములను ప్రోత్సహించుచున్నది. (అపొ.కా. 20:7). మానవుడు తన ఆధిక్యత కొరకు ఏర్పాటు చేసికొన్న బిరుదులను బైబిలు వ్యతిరేకించు చున్నది. మత సంబంధమైన బిరుదులు క్రైస్తవ్యమునకు విరుద్ధమైనవని క్రీస్తు ఖచ్చితముగా బోధించెను (మత్త 23:1-2). ప్రతి క్రైస్తవుడు రాజులైన యాజక సమూహములో సభ్యత్వము కల్గియున్నాడు (1పేతు 2:9). శతాబ్దాలనుండి పరిశుద్ధ లేఖనములోని అంశాలను తీసివేసి కొన్ని మానవ కల్పిత బోధలను చేర్చుచున్నారు. చిలకరింపు, చిన్నపిల్లల బాప్తీస్మము, మరియ నామమున ప్రార్ధించుట, జన్మ పాపము, ప్రత్యేక పరిశుద్ధ దినాలను ఆచరించుట మొదలగు అబద్ధ బోధలను బైబిలు నందు వ్రాయబడియున్న సామాన్య వచన భాగములు ఖండించుచున్నవి. (చదవండి అపొ.కా. 8:12, 1తిమోతి 2:5; 2యోహా 9, అపొ.కా. 17:29; గలతీ 4:10-11). సశేషం.

- జావీ రామ్సే

## ద్రాక్షావల్లి మరియు తీగెలు

**(The Wine and the Branches )**

అలంకార రీతిగా ఉపదేశించడం యేసు ప్రభువుకు యిష్టమైన ఒక పద్ధతి. సామాన్య జీవితంలో యదార్ధతకు సమీపంగా యున్న ఈ వర్ణనల ద్వారా తన పాఠములు అర్ధమయ్యేలాగున ఆయన బోధించేవారు. అందువలన "సామాన్య

జనులు ఆయన మాటలను సంతోషముతో వినుచుండిరి" (మార్కు 12:37). అట్టి ఉపదేశములలో ఆయన అప్పగింపబడకముందు ద్రాక్షావల్లి దాని తీగెలను గూర్చి చేసిన ఉపదేశమొకటి. అది ఆత్మీయ సత్యమును బోదించుటకు ఉపదేశించబడినది:

"నేను నిజమైన ద్రాక్షావల్లిని, నాతండ్రి వ్యవసాయకుడు. నాలో ఫలింపని ప్రతితీగెను ఆయన తీసి పారవేయును; ఫలించు ప్రతితీగె మరిఎక్కువగా ఫలించవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసి పారవేయును. నేను మీతో చెప్పిన మాటలను బట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు. నాయందు నిలిచి యుండుడి, మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచి యుంటేనే గాని తనంతట తానే యేలాగు ఫలింపదో, అలాగే నాయందు నిలిచి యుంటేనే గాని మీరును ఫలించరు. ద్రాక్షావల్లిని నేను తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచి యుండునో, నేను ఎవని యందు నిలచి యుందునో వాడు బహుగా ఫలించును. నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచి యుండని యెడల వాడు తీగవలె బయట పారవేయబడి యెండిపోవును. మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును. నాయందు మీరును మీయందు నామాటలును నిలిచియుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును; ఇందువలన మీరు నా శిష్యులగుదురు" (యోహా 15:1-8).

యేసుప్రభువు చెప్పిన ఈ సుందర దృశ్యములో, తన శిష్యులతో ఆయనకున్న సంబంధము చక్కగా వర్ణించబడినది. ఈ ఉపమానాలంకారములో క్రీస్తు బోధించిన కొన్ని పాఠములను గమనించుము:

## ద్రాక్షావల్లి యజమాని దేవుడు

మొదటిగా, దేవుడు ద్రాక్షావల్లి యజమానుడై యున్నాడు. "నేను నిజమైన ద్రాక్షావల్లిని, నాతండ్రి వ్యవసాయకుడు" అని క్రీస్తు చెప్పారు. జీవనాధారముగ దేవుడు క్రీస్తును ఈ లోకంలో నాటి. ఆయన ద్వారా తీగెలు దేవునితో సంబంధము కలిగి జీవము కలిగి యుండునట్లు ఆయన నొక్కని మాత్రమే ద్రాక్షావల్లిగా చేసాడు.

పాత నిబంధన ప్రవచనములనునెరవేర్చిన మెస్సీయ యేసుక్రీస్తు గనుక ఆయన నిజమైన ద్రాక్షావల్లియై యున్నాడు. అందువలన దేవుని యొద్దకు వెళ్ళేమార్గము యేసుద్వారానే యున్నది. జీవముగల నిజమైన ద్రాక్షావల్లి ఆయన ఒక్కడు మాత్రమే.

ద్రాక్షావల్లి యొక్క యజమాని దానిని సరిచేసి కత్తిరించి సాగుచేస్తాడు. యజమానియు సాగుచేయువాడైన దేవుడు తీగెలు బహుగా ఫలించాలని కోరుచున్నాడు. ఫలించు తీగెలు మరిఎక్కువగా ఫలించునట్లు ఫలింపలేని తీగెలను ఆయన కోసి బయట పారవేయును. వాక్యముద్వారా ఈ పరిశుభ్రత జరుగును (3వ వచనము).

క్రీస్తుకును ఆయన శిష్యులకును మధ్య వ్యక్తిగత సంబంధమున్నది.

రెండవదిగా, ద్రాక్షావల్లికిని తీగెలకును ఉన్నసంబంధము క్రీస్తుకును ఆయన శిష్యులకును ఉన్న సంబంధము ఒక్కటే. ప్రకృతి ప్రపంచములో తీగెకు ద్రాక్షావల్లి యెట్టిదో, ప్రతి మనుష్యునికి క్రీస్తు అట్టివాడు. తీగెలకు ద్రాక్షావల్లి ఆహారము సరఫరా చేయును. తండ్రితో ఏకమైన యేసు సమస్త జీవానికి ఆధారభూతుడు. ఆయన శిష్యులు పరిశుద్ధ ఫలము ఫలించునట్లు ఆయన సహాయము చేయును. ఒండొరుల సంబంధములో ద్రాక్షావల్లి తీగెలు ప్రముఖ ఏకత్వము కలిగి ఏకమై యున్నవి. తీగెలు ద్రాక్షావల్లి నుండి జీవమును పొందుచు ద్రాక్షావల్లి యిచ్చు ఫలములనే అవి యిస్తాయి. అట్లే క్రైస్తవులు శారీరకంగా గాక, ఆత్మీయంగా క్రీస్తుతో ఏకత్వము కలిగియున్నారు (గలతీ 2:20). వారు క్రీస్తు ద్వారా దేవుని నుండి తమ జీవమును పొందుచు తండ్రితో ఏకమైయున్నారు.

పండ్లు ద్రాక్షావల్లిపై గాక ఎల్లప్పుడు తీగెలపైనే కాయును. అట్లే ద్రాక్షావల్లికి వేరై తీగెలు ఎన్నడు పండ్లు కాయవు. తీగెలు లేకుండా ద్రాక్షావల్లి ఫలములు ఫలించదు, ద్రాక్షావల్లి లేకుండా తీగెలు బ్రతుకవు. అట్టి పరస్పర సంబంధమే క్రీస్తుకు ఆయన అనుచరులకు మధ్యఉన్నది. అందువలన "నేను ద్రాక్షావల్లిని మీరు నా తీగెలు" అని క్రీస్తు చెప్పాడు.

క్రీస్తు ద్రాక్షావల్లి అయిఉన్నాడు. వ్యక్తిగత క్రైస్తవులు తీగెలు. ద్రాక్షావల్లికి తీగెలకున్నట్టి సంబంధమువలె క్రీస్తు శిష్యులకు క్రీస్తుకు మధ్య సంబంధమున్నది.

## తీగెలు శిష్యులు గాని మతశాఖలు కాదు

మూడవదిగా, ఆయా డినామినేషన్లు సంఘముయొక్క శాఖలు కాదు. నేటిలోకములో యున్న ఆయా మతశాఖలన్నియు ద్రాక్షావల్లి యొక్క తీగెలని, అవన్నియు కలసి నిజమైన సంఘమగునని కొందరిభావన. అయితే "నేను నిజమైన ద్రాక్షావల్లిని, డినామినేషన్లన్నియు తీగెలని" క్రీస్తు చెప్పలేదు. "ద్రాక్షావల్లిని నేను. మీరు తీగెలని" ఆయన చెప్పారు. తీగెలను మాట వివిధ మతశాఖలకు వర్తించదనుటకు కనీసం మూడు కారణాలున్నాయి:

మొదటిగా ద్రాక్షావల్లిని నేను అని యేసు చెప్పుసరికి నేడున్న మతశాఖలలో యేదియు లేదు. క్రీస్తు తరువాత కొన్ని వందల సంవత్సరముల వరకు మతశాఖల తత్త్వము ఆరంభంకాలేదు. తీగెలు లేకుండా ద్రాక్షావల్లి ఫలములు ఫలించి జీవము కలిగియుండలేదు. కొందరను కొనుచున్నట్లుగా మతశాఖలు గనుక తీగలైతే అవి ఉద్భవించిన కొన్ని శతాబ్దముల వరకు సంఘము తీగలు లేనిదై ఫలహీనమైనదై నిర్జీవము అయిన సంస్థలవలె యున్నదన్నమాట! అయితే తీగెలను గూర్చి చెప్పినప్పుడు అవి మతశాఖలని క్రీస్తు యొక్క ఉద్దేశము కాదనుననది విధితమే.

రెండవదిగా, ఒకే ద్రాక్షావల్లినుండి వందలకొలది, వేలకొలది తీగెలు వచ్చి, ఆ ఒక్కొక్క తీగెమీద వేర్వేరు ఫలములు ఫలించుట ప్రకృతి విరుద్ధము. అమెరికాలోనే 250 కంటే ఎక్కువ డినామినేషన్లున్నవి. ద్రాక్షావల్లి యొక్క ఒకతీగె గుమ్మడికాయలు, మరొకటి దోసకాయలు, ఇంకొకటి ద్రాక్షాపండ్లు కాయునా? అట్టిది ప్రకృతి విరుద్ధము కాదా? అయితే ప్రకృతిలో ద్రాక్షావల్లి యొక్క ప్రతి తీగె ఒకే రకమైన ఫలములు ఫలించును. అయినను ద్రాక్షావల్లి యొక్క తీగెలు వివిధ ఫలములను ఫలించునని అంగీకరించని ప్రజలు నిజద్రాక్షావల్లియైన క్రీస్తులో యున్న ప్రతి తీగె ఒక డినామినేషనని చెప్పే వింత వర్ణనను అంగీకరిస్తారు. మతశాఖల తత్వాన్ని సమర్థించుటకు బైబిలులో

ఎవనికిని యేమీ దొరుకదు. దేవుని దృష్టిలో చీలికలు పాపము . ఆదిమ సంఘము ఏకత్వము కలిగిన విశ్వాసుల సమాజము (యోహా 17:20, 23; 1కొరింథీ 1:10-13; 12:12-27; ఎఫెసీ 1:22,23; 4:3,6). అపొస్తలుల కాలములో క్రైస్తవులు నేడున్న మతశాఖలలో దేనిలోను సభ్యులుకారు. వారు కేవలము ప్రభువు సంఘసభ్యులు. అందువలన అపొస్తలు డెవడును సంఘము యొక్క 'ఏశాఖను' సంబోధించలేదు.

మూడవదిగా, వివిధ డినామినేషన్లు తీగెలని క్రీస్తు వర్తింపజేయలేదు . ఏలయనగా ఆయన వ్యక్తిగత నామవాచకమగు 'మీరు' అనుమాటలను వినియోగించాడు. "ద్రాక్షావల్లిని నేను తీగెలు మీరు" అని ఆయన చెప్పాడు. మరల ఎవడైనను (ఏ మనుష్యుడైనను) నాయందు నిలిచి యుండని యెడల వాడు (ఆ మనుష్యుడు) అని ఆయన చెప్పారు. ద్రాక్షావల్లి నుండి వచ్చిన తీగెలన్నియు ఆయన శిష్యులని యేసు పలికారు. క్రీస్తు యొక్క శిష్యులు 'సంఘశాఖ' యొక్క సభ్యులు కారు. ప్రజలే క్రీస్తుయొక్క తీగెలు లేక కొమ్మలు.

"నేను ఫలాని మతశాఖలో సభ్యుడనని" కొందరుచెబుతారు. "నాలో నిలిచి యుండుడి" యని క్రీస్తు చెప్పాడు. డినామినేషన్లలలో సభ్యులు కాకుండా మొదటి శతాబ్దములో ప్రజలు క్రీస్తు సంఘ సంభ్యులుగా ఉండగలిగిన యెడల, అప్పుడది సరియైతే ఇప్పుడెందుకు అది సరికాదు? ఈనాడు ప్రజలు క్రొత్త నిబంధనను విశ్వసించి విధేయత చూపిన యెడల అదివారిని క్రైస్తవులుగాను క్రీస్తు శరీరములో సభ్యులుగాను మాత్రమే తయారు చేయును. క్షేమకరమైన మార్గదర్శిగా క్రొత్త నిబంధన యుండగా, తాను క్రైస్తవుడను, క్రైస్తవుడనుగా మాత్రమే యుందునని మానవుడు నిశ్చయించుకొనవలెను. అతడు ఏ డినామినేషన్‌కు చెందకుండా సత్యాన్నంతటిని విశ్వసించి విధేయత చూపగలడు. అతడు అప్పుడు ఏ డినామినేషన్‌కు చెందకుండా రక్షింపబడి పరలోకమునకు వెళ్ళగలడు (సశేషం).

- పెర్రి బి. కోతమ్.

# రెండు మార్గములు

## (THE TWO GATES)

### (మత్తయి 7:13-14)

"ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును, ఆదారి సంకుచితమునై యున్నది. దాని కనుగొనువారు కొందరే" యని మత్తయి 7:13-14లో యేసుప్రభువు బోధించారు.

ఈ మాటలను ఆయన కొండమీద చేసిన గొప్ప ప్రసంగములోని ఆఖరి భాగంలో చెప్పారు. అందులో ఆయన రెండు ద్వారములను గూర్చి, రెండు దారులను గూర్చి, రెండు నిత్యగమ్యములను గూర్చి రెండురకాలైన ప్రజలను గూర్చి బోధించారు. ఒకదానిలో కొందరే యుంటారు, మరొక దానిలో అనేకులుంటారు. ఈ లోకంలో ఉద్భవించిన మనుష్యులందరు ఈ రెండు ద్వారములలో ఏదో ఒకదాని ద్వారా వెళ్తారు, ఏదో ఒకదారిగుండా వెళ్తారు మరియు ఈ రెండింటిలో ఏదో ఒక నిత్య గమ్యమునకు చేరుకొంటారు.

## కొన్ని తారతమ్యములు

ప్రభువు చెప్పిన ఈ మాటలలో కొన్ని తార తమ్యములు కూడ లేకపోలేదు. ఒకటి ఇరుకు ద్వారము, రెండవది వెడల్పైన ద్వారము. ఒకటి ఇరుకును, సంకుచితమునైన మార్గము. రెండవది విశాలమైన మార్గము. ఒకదానిలో అనేకులు మరొక దానిలో కొందరే ప్రవేశిస్తారు. ఒకటి నాశనమునకు నడిపిస్తాది, మరొకటి జీవమునకు నడిపిస్తాది.

మొదటిగా యేసు ప్రభువు ఇరుకు ద్వారమును ప్రవేశించుడియని చెప్పారు. ఈ ద్వారము ఇరుకైనది, దానిలో ప్రవేశించుట కష్టము. మనము ఈ ద్వారమున

ప్రవేశించాలని ప్రభువు హెచ్చరించారు. అంటే దీనిలో ప్రవేశించుటకు మనం కొంత ప్రయత్నం చేయాలి. లూకా 13:24లో ఆయన ఇరుకు ద్వారమున ప్రవేశింప పోరాడుడి; అనేకులు ప్రవేశింపజూతురు గాని వారివలన కాదని మీతో చెప్పుచున్నానని చెప్పెను. అంటే ఈ ద్వారమున ప్రవేశించుటకు మనం కొంత శ్రమ పడవలసి వస్తాదని ప్రభువు యొక్క ఉద్దేశము. "విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము. నిత్యజీవమును చేపట్టుము" అని అపొ.పౌలు తిమోతిని హెచ్చరించాడు. అంటే ప్రభువు చెప్పిన ఈ ఇరుకు ద్వారమున ప్రవేశించుటకు మనం ప్రయత్నించాలి. ఈ మార్గములో యుండుటకు మనము నిరంతరము కృషిచేయాలి, శ్రమలను హింసలను భరించాలి. గనుక జీవమునకు పోవుదారి సుళువైనదికాదు. సరదాలతోను, కులాసాలతోను నిండియున్నదికాదు అని మనం గ్రహించాలి.

రెండవదిగా ఈ ద్వారములో మనం ప్రవేశించాలి, ఈద్వారమును గూర్చి బోధించబడగా మనం వినుట సరిపోదుగాని దానిలో మనం ప్రవేశించాలి. మన తల్లిదండ్రులు, బంధువులు దానిలో ప్రవేశిస్తే సరిపోదు. దానిలో మనకుగామనం ప్రవేశించాలి, మనం దేవుని వాక్యం వింటేనే సరిపోదు. పరలోకమందున్న తండ్రిచిత్తము చొప్పున చేయువారే నిత్యజీవంలో ప్రవేశిస్తారు. మనం దేవుని యందు విశ్వాసముంచినంత మాత్రమున సరిపోదు. దేవుడు ఏకాలంలోను, ఏయుగంలోను, ఎవరినీ వారి విశ్వాసము వలన మాత్రమే గాక వారు విశ్వాసమునకు చూపిన విధేయత వలన వారిని అంగీకరించెను.

## సంకుచిత మార్గము

మూడవదిగా జీవమునకు పోవు ద్వారము సంకుచితమైనది. అంటే అది ఇరుకైనది దానిలో ప్రవేశించుట కష్టం. "జీవ వృక్షమునకు హక్కు గలవారై గుమ్మములగుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకు కొనువారు ధన్యులు. కుక్కలును మాంత్రికులును వ్యభిచారులును నరహంతకులును విగ్రహారాధకులును అబద్దమును ప్రేమించి జరిగించు ప్రతి వాడును వెలుపట నుందురు" (ప్రక 22:14-15). జీవమునకు పోవు ద్వారము వెడల్పుగాను,

విశాలముగాను యుంటే ఈ రకమైన దుర్మార్గులందరు అందులో ప్రవేశిస్తారు. జీవమునకు పోవు ద్వారము ఇరుకుగాను, సంకుచితముగాను యుంటే అందరు అందులో ప్రవేశించరాదని కాదుగాని, అందరు అందులో ప్రవేశించాలని ప్రభువు చెప్పారు. ప్రకటన గ్రంథము 22:12లో పరలోక పట్టణమునకు 12 గుమ్మములున్నట్లు చెప్పబడినది. ఒక్కొక్క ప్రక్కన మూడేసి గుమ్మములున్నవి. దీనిని బట్టి ప్రతిదిశనుండి, జనాంగమునుండి, భాషలనుండి ప్రజలు అందులో ప్రవేశించాలనే ఆహ్వానము, లేదా స్వాగతం ఆ గుమ్మములు పలుకుచున్నట్లున్నది. ఆ గుమ్మములు ఎన్నడు మూయబడవు. అయితే ఆ దారి సంకుచితమైనది. ఏలయనగా "గొర్రెపిల్ల యొక్క జీవగ్రంథమందు వ్రాయబడినవారే దానిలో ప్రవేశింతురు గాని నిషిద్ధమైన దేదయినను, అసహ్యమైన దానిని, అబద్ధమైన దానిని జరిగించువాడైనను దానిలోనికి ప్రవేశింపనే ప్రవేశింపడు" (ప్రక21:27). అందరు జీవమార్గములో ప్రవేశించాలని ఆహ్వానింప బడుచున్నారు గాని వారు దానిలో ప్రవేశించునప్పుడు తమ దుష్టత్వాన్ని దుర్మార్గతను సంపూర్తిగ విసర్జించాలి.

దేవుని కంటె ధనమును ఎక్కువ ప్రేమించువారు ఈ జీవమార్గములో ప్రవేశింపలేరు. "ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట దుర్లభము" అని ప్రభువు చెప్పారు (మత్తయి 19:23). ఒకడు ధనవంతుడై నందువలన కాదుగాని, జీవితంలో అతడు దేవుని కంటె ధనార్జనకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చుట వలన దానిలో ప్రవేశింపడు. తన ధనమునందు నమ్మిక యుంచు వాడెవడును దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు. శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములు ఇరుకు ద్వారమున ప్రవేశింపకుండ ఒకని ఆటంకపరచును. గనుక మనము పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుట మంచిదే. అయితే దానితోనే సరిపోదు. క్రైస్తవ జీవితాన్ని ఈ సంకుచిత మార్గమున జాగ్రత్తగా జీవించాలి, "అంతమువరకు సహించినవాడే రక్షింపబడును" (మత్తయి 24:12).

జీవమునకు పోవు ద్వారము ఇరుకైనది. ఏలయనగా సత్యము ఇరుకైనది. అది అసత్యమంతటిని బహిష్కరిస్తాది. ఈ సత్యమార్గము విశ్వాసమార్గము. అది ఇరుకైనది ఏలయనగా అది ఒకే ఒక గమ్యానికి నడిపించును. ఈలోక మార్గములైతే అనేకములు

అవి అతి విశాలమైనవి. వాటన్నిటి అంతము ఒక్కటే, అంటే నిత్య నాశనమే అయినను దానిలో ప్రవేశించువారు అనేక రకాలైన తలంపులను, సుఖభోగములను అనుభవిస్తు వాటి వలన కలుగు ప్రమాదములను ఎరుగక యుంటారు.

విశాలమైన మార్గమున ప్రవేశించువారితో పోల్చుకొంటే, ఇరుకు ద్వారమున ప్రవేశించువారు కొందరే, చాలతక్కువ మంది మాత్రమే. దానిని కనుగొనువారు కొందరే. ఈ మార్గాన్ని కనుగొనుటకు ప్రయత్నించాలి. కృషిచేయాలి, పట్టుదల కలిగియుండాలి, గనుక దాన్ని కనుగొనుటకు ప్రయత్నించువారు కొందరే.

## నాశన మార్గము

అయితే విశాల మార్గము ప్రజలకు సుళువుగా కనబడును. ఏరకమైన శ్రమలేక ప్రజలు దానిలో ప్రవేశిస్తారు. అది స్వార్ధప్రియుల మార్గము, సుఖభోగములను వెదకు వారి మార్గము, అది ఈ లోకస్థుల మార్గము. దానిలో ఏ రకమైన నిషేధములు, అభ్యంతరములు లేవు గనుక అది విశాలమైనది. దానిలో ప్రవేశించుటకు ఒకడు చేయవలసినది ఏదీ లేదుగనుక అది సుళువైనది. దానిలో ప్రయాణం చాల తేలిక ఏలయనగా అది ఎల్లప్పుడు క్రిందికి దిగిపోవు మార్గము. దానిలో రద్దీ ఎక్కువ యుంటాది. ఏలయనగా జనులు తండోప తండాలుగా యుంటూ శరీరేచ్ఛలను స్వేచ్ఛగా నెరవేర్చుకొనుచు యుంటారు. అది మోసకరమైన మార్గము ఏలయనగా అది చివరకు ఎక్కడకు నడిపించునో దానిలో యున్నవారికి తెలియదు. తినుము, త్రాగుము, సుఖించుము అనే సిద్ధాంత ప్రకారము వారు జీవిస్తారు. ఆ మార్గము వారికి తిన్ననైనదిగా కనబడును గాని చివరకది మరణమునకు నడిపించును (సామె 14:12). అది నాశన మార్గము.

విశాల మార్గము నిత్యనాశన మార్గము. అది నిత్యనరకాగ్నికి ఒకని నడుపును. అక్కడ అగ్ని ఆరదు, పురుగు చావదు. అది భక్తిహీనుల మార్గము. "దుష్టుల మార్గము నాశనమునకు నడుపును" (కీర్త 1:6).

గనుక "నీవు నడచు మార్గమును సరాళము చేయుము" అని జ్ఞానియైన

సొలొమోను హెచ్చరించుచున్నాడు (సామె 4:26). సామాన్య సంగతులలో మనం కనీస మాత్రం జాగ్రత్త వహిస్తాము. అయితే ఆత్మీయ విషయాల్లో మనం ఎందుకు జాగ్రత్త వహించకూడదు?

అలనాడెప్పుడో ప్రవక్తయైన యెషయా ఇట్లు చెప్పాడు: "అక్కడ దారిగానున్న రాజమార్గమేర్పడును. అది పరిశుద్ధ మార్గమనబడును. అది అపవిత్రులు పోకూడని మార్గము. అది మార్గమున పోవువారికి ఏర్పరచబడును. మూఢులైనను దానిలో నడుచుచు త్రోవను తప్పక యుందురు..... విమోచింపబడినవారే అక్కడ నడచుదురు. వారి తలలమీద నిత్యానందముండును.వారు ఆనంద సంతోషములు గలవారై వచ్చెదరు. దుఃఖమును నిట్టూర్పును ఎగిరిపోవును" (యెషయా 35:8,9).

యేసుప్రభువు నందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది నిత్యజీవ మార్గమున ఈనాడే ప్రవేశించుము.

- జాషువా గూటం.

## కాలము యొక్క పరమార్థము

**(The Essence of Time)**

దేవుడు మానవుని యొక్క విమోచనమును అనాది కాలములోనే సంకల్పించెను (2తిమో 1:9). ఆ సంకల్పమును ఆయన తన వాక్యమగు బైబిలు గ్రంథములో మనకు బయలు పరచెను.

గతయుగాల్లో యున్నవారందరి కంటే మనము చాల ధన్యులము. ఏలయనగా మానవుని తన యొద్దకు విమోచించుకొనే దేవుని సంకల్పము యుగముల తరబడి ఎట్లు బయలు పరచబడినదో ఇప్పుడు మనం వెనుకకు తిరిగి అవలోకనము చేసికొనగలము. నేడు మనం చూచుచున్నదానిని చూడాలని కాక్షించిన గొప్ప పురుషులు పాతనిబంధన కాలంలో యుండిరి; రక్షకుడైన క్రీస్తును, ఆయన

రాజ్యమైన సంఘమును, వారు చెప్పినట్టియు వ్రాసినట్టియు మాటల యొక్క నెరవేర్పును వారు చూడాలని కాంక్షించారు.

క్రీస్తుయొక్కయు, సంఘము యొక్కయు ఛాయ పాత నిబంధనలో అతి ప్రాముఖ్యమైన భాగమై యున్నది. అందువలన క్రొత్తనిబంధన బోధించు దానికంతటికిని పాతనిబంధన యొక్క పూర్వపు చరిత్రను పఠించవలెను. పాత నిబంధన లేఖనముల జ్ఞానము కలిగి యుండుటను గూర్చి క్రీస్తు యిచ్చిన ప్రాముఖ్యతను గమనించుదము. క్రొత్త నిబంధనలో లేఖనము లేక లేఖనములు అను మాట కనబడునప్పుడెల్లా అది పాత నిబంధననే సూచించు చున్నట్లు గమనించుము. ఏలయనగా యేసు క్రీస్తు జీవించు కాలములో లిఖించబడి యున్న లేఖనము (లు) పాతనిబంధన మాత్రమే.

యెరూషలేములో యున్న యూదులతో యేసు, "లేఖనముల యందు మీకు నిత్యజీవమున్నదని తలంచుచు వాటిని పరిశోధించుడి. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" యని చెప్పెను (యోహాను 5:39).

సిలువ అనంతరము ఎమ్మాయి అను ఒక గ్రామమునకు వెళ్లుచున్న ఇద్దరు శిష్యులతో "ఆయన-అవివేకులారా, ప్రవక్తలు చెప్పిన మాటలన్నిటిని నమ్మని మందమతులారా, క్రీస్తు ఈలాగు శ్రమపడి తన మహిమలో ప్రవేశించుట అగత్యము కాదా అని వారితో చెప్పి, మోషేయు సమస్త ప్రవక్తలును మొదలుకొని లేఖనములన్నిటిలోను తన్ను గూర్చిన వచనముల భావము వారికి తెలిపెను" (లూకా 24:25-27).

అపొస్తలుల కార్యములు 7వ అధ్యాయములో స్తెఫను అబ్రాహాము మొదలుకొని పాత నిబంధన చరిత్రయంతటిని వినియోగించి, తాను దేవదూషకుడను కానని నిరూపించెను.

అపొ.కా. 18:28లో అపొల్లో "యేసే క్రీస్తని లేఖనముల ద్వారా అతడు దృష్టాంతపరచి యూదుల వాదమును బహిరంగముగాను గట్టిగాను ఖండించుచు వచ్చెను".

రోమా 15:4లో పౌలు ఇట్లు చెప్పెను: "ఏలయనగా ఓర్పువలనను, లేఖనముల వలని ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధకలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి".

2తిమోతి 3:14-17 పౌలు తిమోతికి ఇట్లు వ్రాసెను: "క్రీస్తుయేసునందుంచ వలసిన విశ్వాసము ద్వారా రక్షణార్థమైన జ్ఞానము నీకు కలిగించుటకు శక్తిగల పరిశుద్ధ లేఖనములను బాల్యమునుండి నీ వెరుగుదువు గనుక, నీవు నేర్చుకొని రూఢియని తెలిసికొన్నవి యెవరివలన నేర్చుకొంటివో ఆ సంగతి తెలిసికొని వాటియందు నిలకడగా యుండుము. దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది".

పాత నిబంధనను ఎరిగి యుండుట ముఖ్యమని చెప్పు లేఖన భాగములలో యివికొన్ని మాత్రమే. అందువలన పాత నిబంధన చరిత్ర నేడు మనకు కాలము యొక్క పరమార్థమై (The Essence of Time) యున్నదని మనం గమనించాలి.

మానవుని విమోచనార్థమైన దేవుని సంకల్పము చరిత్రార్థముగా మనకు బయలు పరచబడెను. ఇవ్విధముగా నెలకొల్పబడిన మతము క్రైస్తవ్యము ఒక్కటి మాత్రమే. మిగతా మతములన్నియు ఒక మనుష్యుని వలన యోచింపబడి, అతని జీవితకాలములోనే నెలకొల్పబడినవి.

నేటివరకును పాతనిబంధన భద్రపరచబడి సజీవముగా యున్నది. బాలుడైన మోషేను గూర్చి లేక యోసేపును గూర్చి, రంగు రంగుల అతని అంగీని గూర్చి, లేదా గొలియాతును చంపిన బాలుడైన దావీదును గూర్చిన కధలను చెప్పుట కొరకే అది భద్రపరచబడి యుండలేదు, యివి గొప్పవారిని గూర్చి చెప్పబడిన గొప్ప సంఘటనలే. అయితే దేవుని సంకల్పములో ఈ గొప్ప పురుషులు తమ వాస్తవిక స్థానాన్ని ఆక్రమించుకొన్నట్లు మనం గ్రహించినప్పుడే, ఆయన మాటలు ఎన్నటికిని గతింపవు అని ఎందుకు చెప్పబడెనో తెలిసికొనగలము. పాత నిబంధన లేకుండా క్రొత్త

నిబంధనను సంపూర్తిగా అర్థము చేసికొనుట సాధ్యపడదు. క్రొత్త నిబంధనను గ్రహించుకొనుటకు మనం ఈ దిగువ రెండు మార్గాలలో ఒకదానిని ఎంచుకొన వలయును:

1. పాతనిబంధనను చదివి దాన్ని గూర్చిన మంచి జ్ఞానము కలిగియుండిన యెడల క్రొత్త నిబంధనలో పాతనిబంధన సంఘటనలు, స్థలాలు వగయిరా చెప్ప బడినప్పుడు మనము చదువుచున్న దానిని మరింత విపులముగా తెలిసికొనగలము. లేదా
2. క్రొత్తనిబంధనలో పాతనిబంధన సంఘటన వచ్చినప్పుడెల్లా, పాతనిబంధన లోనికి వెళ్ళి దానిని చదివి గ్రహించుకొనుటకు ప్రయత్నించవచ్చును.

నేను మొదటి పద్ధతి ననుసరించాను, అది నాకు చాల సహాయపడింది. మీకును సహాయపడగలదు. క్రొత్త నిబంధనలో నుంచి పాత నిబంధనకు, పాత నిబంధనలో నుంచి క్రొత్త నిబంధనకు వెళ్లుచు పలు సంవత్సరములు శ్రమపడిన తరువాత క్రీస్తును గూర్చి, ఆయన సంఘమును గూర్చి అర్థము చేసికొనుటకు, నేను ఆదిలోనే ఆరంభించాలని చివరకు నాకు గోచరమయ్యింది-దేవుడు తన సంకల్పాన్ని బయలు పరచుట కారంభించిన చోట, పాత నిబంధనలో నేనుకూడ ఆరంభించాలని నాకు గోచరమయ్యింది.

పాత నిబంధన కూడా బాగుగా ఎరిగి యుండుట మంచిదని నాకెవరూ యిదివరకు బోధించలేదు. ఎంత పొరబాటో! అయితే పాత నిబంధనను చదువుట కారంభిస్తే ఎంత దీర్ఘకాల ప్రయాసో? అదినాకు, నా విద్యార్థులకు ప్రయోజనకరమవునా? ప్రయోజనకరమవునని నాకు తెలుసు.

యెరిగిన సంగతులద్వారా గుర్తుంచుకొనుట యను బోధనా పద్ధతి చాల శ్రేష్టమైనది. ఈ పద్ధతి రెండువేల సంవత్సరముల పాతది. ఏలయనగా పరమ బోధకుడైన యేసుక్రీస్తు ఉపమానముల ద్వారా బోధించారు. తన శిష్యులు బాగుగా యెరిగిన సంగతులతో ఆయన గొప్ప ఆత్మీయ పాఠములను బోధించారు. అందువలన "యెరిగిన సంగతుల ద్వారా బోధించు" విధానమును నేనుకూడా కనుగొన్నాను. ఈ పద్ధతి వలన ఆయా వయస్సులలో యున్న వారందరు బోధింపబడవచ్చును. నేను


"గడియారపు ముఖము" పద్ధతిని కనుగొన్నాను. అదెలా పనిచేయునో మీకు తెలియ చేయగోర్తాను.

మొదటిగా పాత నిబంధన పుస్తకములను వివిధ అంశముల వారీగా విభజింతము. అవి ఐదు ఉన్నవి: చట్టము (ధర్మశాస్త్రము), చరిత్ర, పద్యకావ్యములు, ముఖ్య ప్రవక్తలు, సామాన్య ప్రవక్తలు. అయితే ప్రస్తుతం మనం మొదటి రెండు భాగములనే పరిశీలించ బోవుచున్నాము.

| చట్టము | చరిత్ర | |
|---|---|---|
| 1. ఆదికాండము | 1. యెహోషువ | 7. 2రాజులు |
| 2. నిర్గమకాండము | 2. న్యాయాధిపతులు | 8. ఎస్తేరు |
| 3. లేవీకాండము | 3. రూతు | 9. ఎజ్రా |
| 4. సంఖ్యాకాండము | 4. 1సమూయేలు | 10. నెహెమ్యా |
| 5. ద్వితీయోపదేశకాండము | 5. 2సమూయేలు | 11. 1దినవృత్తాంతములు |
| | 6. 1రాజులు | 12. 2దినవృత్తాంతములు |

ఇవన్నీ పాత నిబంధనలో చరిత్ర గ్రంధములు. గనుక ఆదిలోనే మనం 39 పుస్తకముల నుండి 17 పుస్తకములను ఎంచుకొన్నాం. చరిత్రలోని ఆఖరి ఐదుపుస్తకములు పాత నిబంధనలో యున్న క్రమములో పైన నేను ఉదహరించలేదని మీరు ఈ పాటికే గమనించి యుందురు. గాని అవి కాలమాన ప్రకారము క్రమ పద్ధతిలోనే ఉదహరించ బడినవి.

పాత నిబంధన చరిత్రలో 12 సహజ భాగములున్నవి. అవి 12 కాలములు. ఈ కాలములను ఒక గడియారములో చూపించెదము. ఈ కాలములను వివరించుటకు గాను నేను 4 గడియారపు చిత్రముల నుపయోగించబోవుచున్నాను. అవి నాలుగు కాదుగాని ఒక్కటే గడియారములోని నాలుగు దశలుగా భావించమనవి. ప్రతి గడియారములోని అంశములను కంఠస్థము చేసిన తరువాతనే, తదుపరి గడియారము నొద్దకు వెళ్లవలెను. ప్రతి గడియారముతోను పాత నిబంధన చరిత్ర అంతయు బోధింపబడుచున్నది.




పై గడియారమును చూడగానే పాతనిబంధన అంతా నీ యెదుట యున్నది. ఇప్పుడు ఈ గడియారములో పాత నిబంధన పుస్తకము, ప్రజలు, స్థలములు, ఆయాకాలములను బట్టి గుర్తించవలసి యున్నది. ప్రతివాడు తన యదార్థ స్థానములోనే యుంచబడును. దేవుని సంకల్పము ఆయన ప్రజలతో ముడిపడి యున్నందున అట్లు చేయుట చాల ప్రాముఖ్యము. వారి క్రమమును గజిబిజి చేసిన యెడల ఆయన సంకల్పము గజిబిజి యగును.

| | | |
|---|---|---|
| జల ప్రళయం పూర్వము | - | జల ప్రళయానికి ముందున్న కాలము |
| జలప్రళయం అనంతరము | - | జళ ప్రళయం తరువాత |
| పితరుల యుగం | - | అబ్రాహాము పిలువబడి నప్పటినుండి యోసేపు మరణం వరకు |
| ఐగుప్తు బానిసత్వం | - | మోషే జననమునుండి, ఐగుప్తు బానిసత్వము నుండి సీనాయి కొండవరకు |
| అరణ్య సంచారము | - | యొర్దాను నది దాటిన నాటినుండి యెహోషువ మరణము వరకు |
| న్యాయాధిపతులు | - | యెహోషువ మరణం తరువాత న్యాయాధిపతుల కాలము. |
| సంయుక్తరాజ్యము | - | ఆఖరి న్యాయాధి పతియైన సమూయేలు న్యాయాధి |

పతుల నుండి రాజులకు నాంది పలుకుట. అతడు మొదటి రెండు రాజులను, సౌలును, దావీదును అభిషేకించెను. సొలొమోను మూడవరాజు.

విభక్తరాజ్యము - సొలొమోను మరణం తరువాత రాజ్యము విభాగింపబడెను. సొలొమోను కుమారుడైన రెహబాము దక్షిణ రాజ్యమగు యూదారాజ్యమునకు రాజు. దానిలో రెండు గోత్రము లుండెను. యరొబాము ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలునకు రాజైయుండెను. దానిలో పది గోత్రములుండెను

యూదారాజ్యము - 250 సంవత్సరముల తరువాత ఇశ్రాయేలు రాజ్యమును అష్షూరు దేశస్థులు చెరగొనిపోయిరి. మరియు ప్రజలు అష్షూరు దేశమందంతటా చెదరి పోయిరి. అయితే యూదా రాజ్యము ఒక్కటి మాత్రమే నిలిచియుండెను.

చెరలోయుండుట - 150 సంవత్సరముల తరువాత, యూదా రాజ్యమును బబులోను వారు చెరగొని పోయిరి.

పునరుద్ధరణ - పర్షియా దేశపు రాజైన కోరేషు యూదులను ఇశ్రాయేలు దేశమునకు తిరిగి వెళ్లుటకు అనుమతించెను.

పాతనిబంధనలోని 12 కాలముల సంక్షిప్తచరిత్ర యిది. ఈ గడియారము చుట్టు మనం పయనించు ప్రతిసారి మరికొంత సమాచారమును దానిలో చేర్చబోవుచున్నాము. ప్రతిమారు దీనిని లోతుగా పఠించవలెను. అయితే ఈ గడియారము యొక్క నాలుగు దశలను కంఠస్థము చేయగలిగినవారు పాతనిబంధన యొక్క గణణీయమైన విద్యార్ధులే.

**Mrs.** - ఫ్రేంకీ లూపర్.

గమనిక: ఈ అంశముపై మరి మూడు వ్యాసములు ప్రచురించ బోవుచున్నాము, గనుక వీటన్నిటిని శ్రద్ధగా చదువండి.

- ఎడిటర్

# కల్పనా కథలు

జనులు... "సత్యమునకు చెవి ఇయ్యక కల్పనా కథలవైపునకు తిరుగు కాలము వచ్చును" అని 2తిమోతి 4:4లో వ్రాయబడియున్నది. ఈ కల్పనా కథలు అనగా చాలామంది సినిమాలు అను అభిప్రాయము కల్గిఉంటారు. నిజమే. సినిమా కథలు కూడా కల్పనా కథలే కాని సినిమాలకు చెవులేకాదు ముఖ్యంగా కన్నులు ఇస్తారు. కల్పనా కథలు అనగా కలిపించు కథలన్నీ కల్పనా కథలే. వాక్యోపదేశకులు అనేకులు కల్పనా కథలను తమ ప్రసంగములో సాధారణంగా వినియోగిస్తారు. ఫలానా బోధకుడు ఒకే ఒక వాక్యము తీసికొని గంటన్నర ప్రసంగము చేసాడు అని చెప్పడము మనము వినియుంటాము. ఆలోచించండి! ఒకే ఒక్క వాక్యము తీసికొని దానిపై గంటన్నర ప్రసంగము సాగించాడు అంటే అందులో విశేషమేముంటుంది? ప్రగల్భాలు స్వానుభవాలు, నవ్వించడానికి వినియోగించే తియ్యని మాటలు మరియు కల్పనా కథలు ఉంటాయి.ఇలాంటి వారిని ఒక గొప్ప ప్రసంగికుడిగా గుర్తిస్తుందీ సమాజం.

దేవుని ఆరాధించుటకు సంఘముగా సమకూడిన వారిమధ్య దేవుడుంటాడు (మత్తయి 18:20). దేవుని సన్నిధిలో గడిపే సమయం అత్యంత ప్రాముఖ్యమైనది. అది ఎంతో శ్రేష్ఠమైనది (కీర్తనలు 84:10). ఇట్టి సమయాన్ని కల్పనా కథలు చెప్పుటలో నవ్వించే మాటలు చెప్పుటలో వృధా చేయుట దేవునికి ఆగ్రహము కలిగించుటయే. ఆ అమూల్య సమయాన్ని దేవుని మహిమ పరచుటకు గడపాలి. వాక్యోపదేశకుడు పలికే మాట సభికుల ఆత్మీయ జీవితాలను బలపరిచేదిగా, రక్షణలో స్థిరపరచునదిగా ఉండాలి. రక్షణలేని వారి హృదయాలను మార్చి ప్రభువు వైపునకు మళ్లించుటకు ఉపయోగపడు మాటలు పలుకాలి కాని ప్రజలను సంతోషపరచుటకు వారిని నవ్వించే మాటలు పలుకకూడదు.

కల్పనా కథలు చెప్పి కాలక్షేపణ చేయకూడదు. అట్లు చేయుట వలన సంఘముయొక్క అమూల్యమైన సమయాన్ని అపహరించిన వారు అవుతారు. అపొస్తలుడైన పౌలు ఇలా అన్నారు-సహోదరులారా, నేను మీ యొద్దకు వచ్చినప్పుడు వాక్చాతుర్యముతో గాని జ్ఞానాతిశయముతో గాని దేవుని మర్మమును మీకు

ప్రకటించుచు వచ్చిన వాడను కాను. నేను యేసుక్రీస్తును అనగా, సిలువ వేయబడిన యేసుక్రీస్తును తప్ప మరి దేనిని మీ మధ్య నేనెరుగకుందునని నిశ్చయించు కొంటిని. మరియు బలహీనతతోను ఎంతో వణకుతోను మీ యొద్దనుంటిని. మీ విశ్వాసము మనుష్యుల జ్ఞానమును ఆధారము చేసికొనక, దేవుని శక్తిని ఆధారము చేసికొని యుండవలెనని, నేను మాటలాడినను సువార్త ప్రకటించినను, జ్ఞానయుక్తమైన తియ్యని మాటలు వినియోగింపక పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనుపరచు దృష్టాంతములనే వినియోగించితిని" (1కొరింధీ 2:1-5). దేవుని సన్నిధిలో భయముతోను వణకుతోను ఉండాలి కాని కల్పనా కథలు విని సంతోషించడం వలన ఫలితం శూన్యం. అంతేకాక దాని వలన దేవునికి సంతోషముండదు. కనుక వాక్యోపదేశకులు కల్పనా కథలను చెప్పరాదు. క్రైస్తవులు కల్పనా కథలు చెప్పేవారిని ప్రోత్సహించకూడదు. వారిని ఖండించాలి.

- **V .J.** బెన్సన్, హైదరాబాద్.

## క్రొత్త నిబంధన ఆరాధనలో వాయిద్యములను ఉపయోగించ వచ్చునా?

పరిశుద్ధ గ్రంధమందు రెండు విధములైన ఆరాధనలు కనబడుచున్నవి. 1.పాతనిబంధన ఆరాధన 2.క్రొత్తనిబంధన ఆరాధన

### పాతనిబంధన ఆరాధన

1. ఇశ్రాయేలీయులు ఏడవ దినమున అంటే శనివారం దేవునిని ఆరాధించిరి. నిర్గ 20:8; నెహెమ్యా 9:14; లేవీ 23:3; మత్త 28:1
2. ఇశ్రాయేలీయులు యెరూషలేములో ఆరాధించిరి.
3. బలులు, ధూపములిర్పించి ఆరాధించిరి.
4. పాటలు మరియు వాయిద్యములు వారి ఆరాధనలో ఉండెను.

   **A.** 1ది॥వృ 23:5లో నాలుగు వేల మంది స్తుతి చేయు నిమిత్తమై దావీదు చేయించిన వాద్య విశేషములతో యెహోవాను స్తుతించు వారుగా నియమింప బడిరి అని వ్రాయబడింది.

**B.** "వారితో కూడ బూరలు ఊదు యాజకులు నూట ఇరువదిమంది నిలిచిరి. బూరలు ఊదువారును పాటకులును ఏకస్వరముతో యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు గానము చేయగా యాజకులు పరిశుద్ధస్థలములో నుండి బయలు వెళ్ళి, ఆ బూరలతోను తాళములతోను వాద్యములతోను కలసి, స్వరమెత్తి, యెహోవా దయాళుడు, ఆయన కృపనిరంతర ముండునని స్తోత్రము చేసిరి". 2దినవృ 5:13.

**C.** "ఆలాగు జరుగవలెనని యెహోవా తన ప్రవక్తల ద్వారా ఆజ్ఞఇచ్చి యుండెను'.' 2దినవృ 29:25

5. దేవుని ఆజ్ఞను బట్టి ఇశ్రాయేలీయులు పండుగలను ఆచరించిరి.
6. పదియవ భాగాన్ని దేవునికి చెల్లించిరి. మలాకీ 3:10
7. లేవీ గోత్రికుడు యాజకుడుగా నుండెను.

మనము ఇంతవరకు పాత నిబంధన ఆరాధనను గూర్చి తెలిసికొని యున్నాము. ఇది శరీరసంబంధమైనది. ఈ నిబంధన మార్చబడునని, ఇది ఒక ఛాయ మాత్రమేనని దేవుని వాక్యము తెలియజేసింది. యిర్మియా 31:31-3 ; యోహా4:21-24

## క్రొత్త నిబంధన ఆరాధన

1. ఆరాధింప వలసిన దినము ఆదివారము అపొ.కా. 20:7 ప్రక 1:10
2. ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలసిన ఆరాధన.
3. క్రీస్తు నామమున తండ్రికి ప్రార్ధన చేయవలెను. కొలస్స 3:17
4. పండుగలు నిషేధింపబడినవి. కొలస్స 2:16
5. పాటలు ఆత్మతోను మనస్సుతోను పాడలెను. ఎఫె 5:19 కొలస్స 3:16 1కొరింథీ 14:15
6. క్రొత్త నిబంధన ఉపదేశము. అపొ.కా. 2:42
7. ప్రభురాత్రి భోజనమును ఆచరింపవలెను. అపొ.కా.20:7
8. వర్ధిల్లిన కొలది కానుకలు ఇవ్వవలెను. 1కొరింథీ 16:2

పాతనిబంధన ఆరాధనకు, క్రొత్త నిబంధన ఆరాధనకు వ్యత్యాసమును గమనించితిమి

| పాత నిబంధన శరీరానుసారమైనది | క్రొత్త నిబంధన ఆత్మీయానుసారమైనది. |
|---|---|
| పాత నిబంధన ఆరాధన | క్రొత్త నిబంధన ఆరాధన |
| 1. ఆరాధించు దినము, శనివారం (ఏడవదినము) | 1. ఆరాధించు దినము, ప్రభువు దినము ఆదివారము |
| 2.పండుగలు ఆరాధనలో ఒక భాగం | 2. పండుగలు నిషేధింప బడినవి. కొలస్స 2:16 |
| 3. పాటలు వాద్యములతో పాడిరి. | 3. వాయిద్యములు లేవు ఎఫె 5:19 కొలస్స 3:16 |
| 4. కానుకలు పదియవ భాగమును అర్పించిరి. | 4. వర్ధిల్లిన కొలది యివ్వవలెను 1కొరింథీ 16:2 |
| 5. యెరూషలేములో ఆరాధించిరి. | 5. మనమే దేవుని ఆలయము 1కొరింథీ 3:16 |

క్రొత్త నిబంధనలో సంఘము వాద్యములను ఉపయోగించినట్లు కానరాదు. వాద్యములను శరీర సంబంధమైనవి. అవి నిర్జీవములు (అపొ.కా. 14:7) "ఆయనకు ఏదైన కొదువ యున్నట్లు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు వాడు" అపొ.కా. 17:25 అని పౌలు ఏథెన్సు వారితో చెప్పెను.

పాతనిబంధన కూడ దేవుని వలననే కలిగినది కదా? అని కొందరు ప్రశ్నించుదురు. వారికే ఇదే సమాధానము. "మరియు వారి మనస్సులు కఠినము లాయెను గనుక నేటివరకును పాతనిబంధన చదువబడునప్పుడు అది క్రీస్తు నందు కొట్టి వేయబడెనని వారికి తేట పరచబడక ఆ ముసుకే నిలిచియున్నది"

"మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులోనుండి బొత్తిగా వేరు చేయబడి యున్నారు" గలతీ 5:4

## పాత నిబంధన ఎందుకు?

1. మనకు బోధకలుగు నిమిత్తము. రోమా 15:4
2. ఈ సంగతులు దృష్టాంతముగా వారికి సంభవించి యుగాంత మందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను. 1కొరింథీ 10:11
3. మనలను క్రీస్తునొద్దకు నడిపించుటకు. గలతీ 3:24

T. Ch. - ఫ్లెమింగ్స్, పెద్దాపురం.

సోదరులు ఐరా. వై. రైస్ గారు పునరుద్ధరణ ఉద్యమమును భారతదేశమునకు వ్యాపింప చేయుటలో ఒక ప్రముఖమైన, బాధ్యతాయుతమైన పాత్ర నిర్వహించిరి. 69 దేశాలలో క్రీస్తు రాజ్యమైన 'సంఘము' విస్తరించుటలో ఆయన భూమిక ప్రశంసనీయమైనది. అనేక సత్ఫలితాలను, ఆత్మలను సంపాదించుచున్న 'బేసిక్ బైబిల్ కోర్సు' ను ఈయనే సిద్ధపర్చిరి. ఈ కోర్సు యొక్క పొందిక, సందేశము, సరళత అనేక మనస్సులను ఆకట్టుకొనగలదు. ఎందుకంటే అది స్వచ్ఛమైన దేవుని సంకల్పమును లేఖనానుసారముగ వివరించుచున్నది. సోదరులు బాబ్ బెరార్డ్ గారు గొప్ప సువార్తికులు. ఆయన దేవుని వాక్యమును మరింత విపులముగాను, హృదయములను వాక్యము హత్తుకొనునట్లు వివరించిరి.

క్రీస్తునకు పరలోకమందును, భూమిమీదను సర్వాధికారము ఇవ్వబడెను. (మత్తయి 28:18). ఆయనకు సృష్టిపై, మరణముపై, రాజులపై, రాజ్యములపై, వ్యాధులపై, పాపములపై అధికారము కలిగియుండెను. సర్వాధికారము దేవుని వలన ఆయన పొందెను. ఈ అధికారమును ఆయన అపొస్తలులకు అనుగ్రహించెను. "పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను. నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను" (మత్తయి 16:19; 18:18). అపొస్తలులు సువార్త ప్రకటించి స్థానిక సంఘములలో సంఘమును పరిపాలించు అధికారమును పెద్దలకు అప్పగించిరి. సువార్తికుడు పెద్దల అధికారమునకు లోబడవలసిన వాడైనను, వాక్యమును ప్రకటించుటలో, హెచ్చరించుటలో, బోధించుటలో ఖండించుటలో సంపూర్ణ అధికారము కలవాడు. ఈ అధికారము సువార్తికునిలో కాదుగాని అతడు బోధించు వాక్యమందున్నది. సోదరులు ఐరా. వై. రైస్ గారు పై వర్తమానమును చక్కగా వివరించిరి. ఈ లోక సంబంధమైన నిరర్థక తత్వజ్ఞానము మానవాళిని నాశనానికి నడిపించుచున్నది. శ్రేష్టమైనది బైబిలు గ్రంధము లేదా దేవుని వాక్యము. దానిని విని విధేయులై మానవులు దేవుని మార్గంలో నడవాలని దేవుని కోరిక. విధేయులై ఆయన రాజ్యంలో అంటే సంఘములోనున్న ఆశీర్వాదాలు, వాగ్దానములు పొందుకొని


సహవాసమందలి మాధుర్యము, ఆనందమందు కొనసాగవలెనని బాబ్ బెరార్డ్ గారు హెచ్చరించిరి. లోకమందున్న 'నకిలీ' సంఘములను గూర్చి, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిరి. 'పరిశీలనాత్మక దృష్టి' మానవులు కలిగి యుండాలని ప్రబోధించిరి. ఈ సదస్సులో 'బేసిక్ బైబిలు కోర్సు' ముగించిన విద్యార్థులకు యోగ్యతా పత్రములు బైబిళ్ళు యివ్వబడెను. ఈ కోర్సు పూర్తిచేసిన యౌవనస్థులు యింకా కొందరు మొత్తం 19 మంది బాప్తిస్మము పొందిరి.

మానవ హృదయాన్ని మార్పు చేయగల శక్తి దేవునికి కలదు. దేవుని హృదయాన్ని మార్చగల శక్తి మన ప్రార్థనలలో ఉన్నది.

\- ఎడిటర్

---

Regd. No. H / KD-45 / K.D. H.O
Date of Posting : 15 th of Every month



From:
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA - 533 001

To